www.kalamdaily.com
కలం
Follow on: Kalamtelugu
09-02-2026, సోమవారం
ప్రజల గళం...

360° SINGLE PAGE TOPIC

మున్సిపోల్స్

మరో రెండు రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు కోసం వ్యూహాలు ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. పదేండ్ల పాలనలోని ఫలాలను, ఫలితాలను బీఆర్ఎస్ ఏకరువు పెడుతున్నది. గత బీఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలను, రెండేండ్లలో తాము చేసిన పనులను కాంగ్రెస్ ప్రస్తావిస్తున్నది. మోదీ ఇమేజ్‌తో బీజేపీ బరిలోకి దిగింది. కల్వకుంట్ల కవిత ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుతో పోటీ చేస్తున్నారు. దాదాపు ఏడాదికి పైగా స్పెషల్ ఆఫీసర్ల పాలనలో మగ్గుతున్న పట్టణ పురపాలక సంస్థలు త్వరలో ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కొలువుదీరనున్నాయి. మొత్తం 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో పురప్రజలు ఏ పార్టీకి పట్టం గడతారో ఫిబ్రవరి 13న తేలనున్నది. పురపాలనపై కలం 360 డిగ్రీస్ స్పెషల్..

- తెలంగాణ బ్యూరో, కలం

పోలింగ్ తేదీ
ఫిబ్రవరి 11

ఓట్ల లెక్కింపు
ఫిబ్రవరి 13

పోలీస్ భద్రత
25,000 మంది

పోటీ చేస్తున్న అభ్యర్థులు
12,944

బస్తీ మే సవాల్

గెలుపు కోసం ప్రధాన పార్టీల ఎత్తులు పైఎత్తులు

ఏ పార్టీ బలమెంత? ఎవరి బలగమెంత? • కలిసొచ్చేది ఏమిటి.. దెబ్బకొట్టేది ఏమిటి?



అధికార పార్టీలకే జనం మద్దతు

తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సమయంలో 2014లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఎక్కువ సీట్లు దక్కాయి. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకి అనే ముద్ర ఉన్నా ఆయన హయాంలో తెలంగాణలో మొత్తం 1,399 స్థానాల్లో 527 చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. తెలంగాణ సెంటిమెంట్‌తో రంగంలోకి దూకిన టీఆర్ఎస్ 312 స్థానాలను కైవసం చేసుకుని సెకండ్ ప్లేస్‌కు పరిమితమైంది. ఆ తర్వాత 2020లో కొత్త మున్సిపల్ చట్టంతో జరిగిన ఎన్నికల్లో మొత్తం 3,112 మున్సిపల్ వార్డులు, డివిజన్లలో అధికార టీఆర్ఎస్‌కు 1,767 సీట్లు దక్కి ఫస్ట్ ప్లేస్‌లో నిలిచింది. కేవలం 580 స్థానాలతో కాంగ్రెస్ సెకండ్ ప్లేస్‌లో, 311 సీట్లతో బీజేపీ థర్డ్ ప్లేస్‌లో నిలిచాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రజలు ఆ పార్టీ అభ్యర్థుల్ని గెలిపించడం ఆనవాయితీగా కొనసాగుతున్నది.

మున్సిపల్ ఎన్నికల ముఖచిత్రం

మొత్తం మున్సిపాలిటీలు	116
వార్డుల సంఖ్య	2,582
మున్సిపల్ కార్పొరేషన్లు	07
డివిజన్లు	414

మొత్తం ఓటర్లు

52.43 లక్షలు

పురుషులు	25.62 లక్షలు
మహిళలు	26.80 లక్షలు

పోలింగ్ కేంద్రాలు
8,203

రిజర్వేషన్లు ఇలా..

అన్ రిజర్వుడు (జనరల్)	647
అన్ రిజర్వుడు (మహిళ)	864
ఎస్సీ జనరల్	254
ఎస్సీ మహిళ	190
ఎస్టీ జనరల్	147
ఎస్టీ మహిళ	40
బీసీ జనరల్	463
బీసీ మహిళ	391

మొత్తం వార్డులు, డివిజన్లు:
2,996
(మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలిపి)



అభివృద్ధి అంతా ఉత్తదే!

ఎక్కడి సమస్యలు అక్కడే.. గతుకుల రోడ్లు, జనం పాట్లు

గల్లీల నిండా చెత్తాచెదారం.. పచ్చదనం పరిహాసం

నాడు బీఆర్ఎస్ గప్పాలు.. నేడు కాంగ్రెస్‌దీ అదే దారి

2020 మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడంతో 'పల్లె ప్రగతి', 'పట్టణ ప్రగతి' కార్యక్రమాలకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పల్లెల్లో, పట్టణాల్లో మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నది ఈ ప్రోగ్రామ్ లక్ష్యం. ప్రతి మున్సిపల్ బాడీలో వైకుంఠధామం, మొక్కల నర్సరీ, డంపింగ్ యార్డు, గార్బేజ్ వాహనాలు, వెజ్-నాన్ వెజ్ సమీకృత మార్కెట్‌లు, తడిచెత్త-పొడిచెత్త సేకరణ, పబ్లిక్ టాయ్‌లెట్లు, క్రీడా మైదానాలు, మౌలిక సౌకర్యాల కల్పన, మిషన్ భగీరథ.. ఇలాంటివాటిని చేపట్టాలన్నది ప్రభుత్వ ఆలోచన. చాలా మున్సిపాలిటీల్లో ఈ సౌకర్యాలు కల్పించినా ఆశించిన ఫలితాలు రాలేదు. చెత్తను తీసుకెళ్లే వాహనాలకు డీజిల్ ఖర్చులు కూడా లేక షెడ్లకే పరిమితమయ్యాయి.

ఆర్భాటం ఘనం.. ఆచరణ శూన్యం

పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణం గురించి కేసీఆర్, కేటీఆర్ చాలా గొప్ప ప్రవచనాలే ఇచ్చారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను సేకరించడానికి ఆకుపచ్చ, నీలం రంగు డబ్బాల విధానాన్ని తీసుకొచ్చారు. కానీ మఖలో పుట్టి పుబ్బలో మాయమైనట్లుగా ఆ స్కీమ్ ఆర్భాటాలకే సరిపోయింది. ప్రజలకు అవగాహన కల్పించడంలో, అమలు చేయడంలో నాటి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. కోట్లాది రూపాయల ఖర్చు వృథా అయింది. పబ్లిక్ టాయ్‌లెట్ల గురించి గొప్పలు చెప్పుకున్నా రోడ్ల పక్కన గోడలే ఇప్పటికీ ఏకైక మార్గం. ఇక పచ్చదనం విషయంలో అభివృద్ధి పేరుతో చెట్ల నరికివేత యథేచ్ఛగా జరిగిపోతున్నది. మొక్కల నర్సరీలను నెలకొల్పినా వాటి పనితీరు ప్రశ్నార్థకంగా మారింది.

వేల కోట్లు ఖర్చయినా టాయిలెట్లే లేవు

'పట్టణ ప్రగతి' కోసం అప్పటి ప్రభుత్వం ప్రతి నెలా క్రమం తప్పకుండా నిధుల విడుదలపై ఉపన్యాసాలు ఇచ్చింది. ఈ ప్రోగ్రామ్‌ను ఉనికిలోకి తెచ్చిన 2020-21 కాలంలో మున్సిపల్ బాడీలకు నెలకు రూ. 70 కోట్ల చొప్పున, ఆ తర్వాతి సంవత్సరం రూ. 53 కోట్లు, 2022-23లో 55 కోట్ల చొప్పున మొత్తం రూ. 4,537 కోట్లను మూడేండ్లలో ఖర్చు చేసినట్లు పదేండ్ల ప్రగతి నివేదికలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం రూ. 6,500 కోట్లను ఖర్చు పెట్టినట్లు ఆ లెక్కలు పేర్కొన్నాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ రెండేండ్లలోనే పట్టణాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 17,442 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇన్ని కోట్లు ఖర్చు చేసినా పట్టణాల్లో పబ్లిక్ టాయ్‌లెట్ల లాంటి కనీస సౌకర్యాలకు అతీగతీ లేదు.

నాడు కేటీఆర్.. నేడు రేవంత్

గత ప్రభుత్వంలో కేటీఆర్ పురపాలక శాఖ మంత్రిగా ఉంటే ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డే ఆ శాఖను చూస్తున్నారు. 'పట్టణ ప్రగతి'తో పట్టణాల్లో అద్భుతమైన ప్రగతి సాకారమైందని, రూపురేఖలే మారిపోయాయని నాడు కేటీఆర్ గంభీర ప్రకటనలు చేశారు. ఇప్పుడు సైతం సీఎం రేవంత్‌రెడ్డి ఏయే మున్సిపాలిటీకి ఎంత ఖర్చు చేసిందీ లెక్కలు చెప్పారు. కానీ, సమస్యలు మాత్రం కంటిన్యూ. డంపింగ్ యార్డుల పేరుతో శివారు ప్రాంతాలన్నీ ఘోరంగా మారిపోయాయి. గతుకుల రోడ్లు, ఆ పక్కనే చెత్త కుప్పలు, పబ్లిక్ టాయ్‌లెట్ల కొరత.. వేల కోట్లు ఖర్చు చేసినా ఈ బాధలు తీరలేదు. సెంట్రల్ ఫైనాన్స్ నిధులు వచ్చినా, కేంద్రం నుంచి స్వచ్ఛభారత్ ఫండ్స్ వచ్చినా, కరీంనగర్ లాంటి పట్టణాలకు స్మార్ట్ సిటీ నిధులొచ్చినా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన అంతంతే.

282 చోట్ల మజ్లిస్ పోటీ

మజ్లిస్ పార్టీ మొత్తం 282 మున్సిపల్ వార్డులు, డివిజన్లలో పోటీ చేస్తున్నది. ఎక్కువగా ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతాలపై దృష్టి పెట్టింది. కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, బోధన్, జగిత్యాల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నారాయణపేట్, ఆదిలాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లోని అర్బన్ మున్సిపాలిటీలపై ఫోకస్ పెట్టింది. మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలపై ఆ పార్టీకి ఆశలు లేనప్పటికీ కొన్ని వార్డుల్ని గెల్చుకుని ఇతర జిల్లాల్లో పార్టీ ఉనికిని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నది.

సింహం గుర్తుతో కవిత

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన కల్వకుంట్ల కవిత మున్సిపల్ ఎన్నికల ద్వారా ఫస్ట్ టైమ్ రంగంలోకి దిగుతున్నారు. కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించినా ఆ ప్రాసెస్ ఇంకా కంప్లీట్ కాలేదు. దీంతో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (సింహం గుర్తు)తో అవగాహన కుదుర్చుకున్నారు. ఆశావహులకు ఆ పార్టీ బీ-ఫామ్ ఇప్పించి బరిలోకి దించారు. మొత్తం 2,996 వార్డుల్లో 288 చోట్ల పోటీ చేస్తున్నది. ఎంత మంది గెలుస్తారు, ఎన్నిచోట్ల బోణీ అవుతుందనేది ఆసక్తికరం. బీఆర్ఎస్‌ను ఎంత డ్యామేజ్ చేస్తారనే చర్చ కూడా జరుగుతున్నది.

కాంగ్రెస్: ఆనవాయితీ రిపీటయ్యేనా?

బలం

- స్వయంగా సీఎం రంగంలోకి దిగడం, ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్‌ను కార్నర్ చేయడం
- రాష్ట్ర మంత్రులంతా వారి సొంత జిల్లాలతో పాటు ఇన్‌చార్జ్‌గా ఇతర జిల్లాల్లో ప్రచారం
- పార్టీ నేతలు, మంత్రులు, డీసీసీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య సమన్వయం
- పంచాయతీ ఎన్నికల గుణపాఠంతో రెబల్స్ బెడద లేకుండా జాగ్రత్త పడడం
- రెండేండ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రస్తావించడం
- అధికార పార్టీకే ఎక్కువ సీట్లు అనే ఆనవాయితీ.

బలహీనతలు

- సీఎం విదేశీ టూర్ నుంచి వచ్చేంతవరకు నత్తనడకన క్యాంపెయిన్
- కొన్ని హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత
- బీఆర్ఎస్ నేతలకు సీఎం తప్ప మంత్రుల నుంచి స్ట్రాంగ్ కౌంటర్ లేకపోవడం
- పట్టణాల్లో మౌలిక సౌకర్యాలు లేక కుంటుపడిన అభివృద్ధి
- ఏడాదిన్నరగా స్పెషల్ ఆఫీసర్ల ఏలుబడిలో ఎమ్మెల్యేల రిక్వెస్టులు బేఖాతర్
- ప్రభుత్వం నుంచి ఆశించిన నిధులు రాక డెవలప్‌మెంట్‌పై ఎఫెక్ట్.

బీఆర్ఎస్: ఎన్నికలకు ముందే కన్ఫ్యూజన్

బలం

- రెండేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రోగ్రెస్ రిపోర్ట్, కార్డుల పేరుతో ప్రచారం
- పట్టణాల్లో పార్టీ లీడర్లు, కేడర్‌తో ముందుగానే సన్నాహక సమావేశాలు పెట్టడం
- బీఆర్ఎస్ రెండో టర్ములో పట్టణ ప్రగతి పేరుతో సమకూరిన మౌలిక సౌకర్యాలు
- స్థానిక లీడర్లతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు బాధ్యతల అప్పగింత
- పార్టీలో నెంబర్ 2, 3 గా ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు జిల్లాల్లో క్యాంపెయిన్
- పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన సీట్లు ఇప్పుడు ప్రభావం చూపే చాన్స్.

బలహీనతలు

- హరీశ్‌రావు, కేటీఆర్, కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ ఎంక్వయిరీకి హాజరు
- సరిగ్గా ఎలక్షన్ టైమ్‌లో మొత్తం పార్టీ కేడర్ దృష్టి ఇటువైపు డైవర్ట్ కావడం
- ఫామ్‌హౌస్ కే కేసీఆర్ పరిమితం కావడంతో పార్టీని నడిపించడంలో వెలితి
- సీఎం రేవంత్ 'జాతిపిత' సెటైర్లు, ట్రాప్‌లోకి లాగడంతో డిఫెన్సులో గులాబీ
- రెండేండ్లుగా కేడర్‌లో నెలకొన్న నిరుత్సాహం, కవిత ఆరోపణలతో డ్యామేజ్
- గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌ను జనం నిలదీయడం.

బీజేపీ: పట్టణ ఓటర్లపై గంపెడాశలు

బలం

- మోదీ ఇమేజ్‌తో పాటు కేంద్ర నిధులతోనే అర్బన్ లోకల్ బాడీస్ అభివృద్ధి అనే ప్రచారం
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్వయంగా ప్రచారంపై దృష్టి పెట్టడం
- ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నచోట భారీ క్యాంపెయిన్
- బీజేపీ సెంట్రల్ కొత్త చీఫ్ ప్రచారానికి రావడంతో రాష్ట్ర శ్రేణుల్లో నూతనోత్సాహం
- కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో మేయర్, చైర్‌పర్సన్ పోస్టులపై గురి
- బీఆర్ఎస్ వీక్‌నెస్‌ను సద్వినియోగం చేసుకునేలా హిందు ఓటు బ్యాంకుపై ఫోకస్.

బలహీనతలు

- రాష్ట్ర నేతల మధ్య కొరవడిన సమన్వయం
- నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులో కేంద్రం నుంచి సహకారం లేకపోవడం
- ఎనిమిది మంది ఎంపీలున్నా రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులను మంజూరు చేయించలేకపోవడం
- కాళేశ్వరం కుంభకోణంపై కేసీఆర్, హరీశ్‌రావుపై సీబీఐ ఎంక్వయిరీ వేయించలేదనే నిందలు
- పరోక్షంగా బీఆర్ఎస్‌తో కుమ్మక్కయిందంటూ వస్తున్న ఆరోపణలు.